దసరా ఉత్సవాలకు పోలేరమ్మ ఆలయం సర్వం సిద్ధం

ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అప్పిరెడ్డి, దేవస్థానం కమిటీ సభ్యులు

నెహ్రూనగర్: భక్తుల పాలిట కల్పతరువై, మహిళల కొంగు బంగారమై వారి కష్టాల్ని కడతేర్చి, అష్టైశ్వ రాల్ని ప్రసాదించే జగన్మాతగా చుట్టుగుంట పోలేరమ్మ తల్లి పూజలందుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. పురాతన చరిత్ర గల పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్ని ఈనెల 15నుంచి 23వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. 20 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 2023 ఉత్సవాలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను స్థానిక పెద్దలు, దేవస్థానం కమిటీ సభ్యులు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులుతో కలసి ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలేరమ్మ తల్లి అత్యంత మహిమాన్వితురాలని తెలిపారు. ఆమెకు ఉత్సవాలు జరపడం మొదలు పెట్టిన నాటి నుంచే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడం మొదలైందని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు పలు అలంకారాలతో పాటు జగన్మాత దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిస్తుందని వివరించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, 24వ డివిజన్ కార్పొరేటర్ అడకా పద్మావతి, అంగడి శ్రీనివాసరావు, కుమ్మర కోటేశ్వరరావు, వనజాక్షి, తుమ్మల నాగేశ్వరరావు, సాంబిరెడ్డి, కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య, రెబ్బా రోశయ్య, సురసాని వెంకటరెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, టెంట్ హౌస్ కొండలు, దొంతా బ్రహ్మం పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నెహ్రూనగర్ 3వ లైనుకు చెందిన వి.ఎస్.ఎన్.సాయిధీరజ్ బీటెక్ చదివాడు. ఇటీవల అతనికి టెలిగ్రామ్‌లో టాస్క్ పూర్తి చేస్తే రూ. వెయ్యి వస్తాయని మెసేజ్ వచ్చింది. ధీరజ్ దాన్ని పూర్తి చేయడంతో అతని అకౌంట్‌లో రూ. వెయ్యి పడ్డాయి. దీంతో ఆశ పడ్డ ధీరజ్ అనంతరం వచ్చిన టాస్క్‌లన్నింటినీ పూర్తి చేస్తూ రూ. 12 లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించాడు. అతనికి రావాల్సిన నగదు అకౌంట్‌లో పడలేదు. నిర్వాహకుల్ని సంప్రదించగా, మరో రూ. 5లక్షలు చెల్లించాలన్నారు. దీంతో మోసపోయినట్లు నిర్ధారించుకుని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



వ్యక్తి అదృశ్యంపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. బుచ్చితోటకు చెందిన దేశు మల్లికార్జునరావు శనివారం తన కూరగాయల షాపు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన భార్య అనురాధ కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గుర్తు తెలియని సుమారు 60 ఏళ్ల వృద్ధుడు అరండల్‌పేట 12వ లైనులో ఈనెల 13వ తేదీ ఉదయం స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332 నంబరుకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

20న మెగా జాబ్ మేళా

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన గుంటూరు పట్టాభిపురంలోని షాదీఖానాలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. జాబ్‌మేళా పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తగిన కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్లు పీవీ మణిదీప్, రవికుమార్, రాజా, వెంకటేష్, సతీష్, చిన్ని, వెంకట్రావు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ఫ్రెషర్స్ డే పోస్టర్ల ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: వైద్య కళాశాలకు వచ్చే ఫ్రెషర్స్‌ను ఇబ్బంది పెట్టకుండా సోదరభావంతో చూడాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ సూచించారు. శనివారం సూపరింటెండెంట్ కార్యాలయంలో అభ్యుదయ– 21 బ్యాచ్ ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 16న వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. నూతన విద్యార్థుల్ని ర్యాగింగ్ చేయకుండా స్నేహితుల మాదిరిగా ఆహ్వానించాలని చెప్పారు. వైద్య కళాశాల గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె. రెడ్డి, జీజీహెచ్ డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్.శ్రీనివాస్‌ప్రసాద్, వైద్య విద్యార్థులు ప్రదీప్, కుర్షిద్, అశ్యామ్, జావేద్, మల్లీశ్వరి, లిఖిత, పద్మ, తేజస్విని, మేఘన, శిరీష పాల్గొన్నారు.

సైదారెడ్డి కుటుంబ సభ్యులకు పురందేశ్వరి పరామర్శ



సైదారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పురందేశ్వరి, వెంకటేశ్వరరావు తదితరులు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శనివారం గుంటూరులో సైదారెడ్డి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీకి అంకితభావంతో పని చేసిన నేతగా సైదారెడ్డిని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటుగా పేర్కొన్నారు. చివరి వరకు పార్టీకి సేవలు చేసిన సైదారెడ్డి మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. సైదారెడ్డి భార్య రమాదేవి, కుమారుడు ప్రదీప్ దత్తులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె వెంట మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, షేక్ బాజీ, నూతలపాటి బాలా, ఈదర శ్రీనివాసరెడ్డి, వెలగలేటి గంగాధర్, అప్పిశెట్టి రంగ, టి.శ్రీనివాస్ ఉన్నారు.

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



విద్యార్థినులతో నూరి ఫాతిమా, కన్న మాస్టారు

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్నతనం నుంచే విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా తెలిపారు. రైలుపేటలోని కన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన గ్రీన్ కలర్ డే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకుపచ్చరంగు ప్రాముఖ్యతను తెలియజేస్తూ తరగతి గదుల్ని అలంకరించడంతో పాటు వివిధ రకాల వస్తువులను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆకుపచ్చని వస్త్రాలతో ఆకట్టుకున్నారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ పర్యావరణాన్ని మనం కాపాడితే మనల్ని అది కాపాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎనిమిదో డివిజన్ కార్పొరేటర్ ఇర్రి ధనలక్ష్మి, 15వ డివిజన్ కార్పొరేటర్ రమణబోయిన అజయ్, కన్న విద్యా సంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముందస్తు దసరా సంబరాలు



సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

నెహ్రూనగర్: మన సంస్కృతి, సంప్రదాయాల్ని విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హిందూ స్కూల్ కార్యదర్శి మద్దూరి రామకృష్ణ పరమహంస తెలియజేశారు. హిందూ కళాశాల, హిందూ స్కూల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అరండల్‌పేట హిందూ పబ్లిక్ స్కూలులో ముందస్తు దసరా సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మన సంప్రదాయాలు, విలువలు తెలియజేయాలన్న ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. భారతీయ సంస్కృతిలో పండుగలు పెనవేసుకుపోయాయని తెలిపారు. చెడుపై విజయాన్ని సాధించడమే దసరా పండుగ పరమార్థమని చెప్పారు. దశావతారాల ద్వారా జగన్మాత, శక్తి స్వరూపిణిగా వివిధ రూపాలతో సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తున్నట్లు వివరించారు.

డాక్టర్ నాగూర్‌బాషాకు అవార్డు



గుంటూరు మెడికల్: నగరానికి చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా గురువారం ఢిల్లీలో ప్రముఖ క్రికెట్ సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. పేదలకు తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేర్ వెల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ప్రతి నెలా ప్రత్యేకంగా లివర్ సమస్యలపై ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రూ. 10వేలు ఖరీదు చేసే ఫైబ్రో స్కాన్ ద్వారా వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. డాక్టర్ నాగూర్‌బాషా సేవల్ని గుర్తించి గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డు అందించడంపై కేర్ వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గౌస్ బాషా, హాస్పిటల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా పాండురంగ విఠల్



గుంటూరు మెడికల్: నగరానికి చెందిన బీజేపీ రాష్ట్ర మిర్చి సెల్ కన్వీనర్ వెలవర్తిపాటి పాండురంగ విఠల్‌ను పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తమపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, చిగురుపాటి కుమారస్వామి, మధుకర్, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్‌కు పాండురంగ విఠల్ కృతజ్ఞతలు తెలిపారు.